క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

జమ్మలమడుగు : యోగివేమన యూనివర్సిటీ పరిధిలో జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాల ఆర్ట్స్ విద్యార్థి ఎస్.ఇమ్రాన్‌బాషా ఐదో సెమిస్టర్‌లో 9.3 జీపీఏ సాధించినట్లు తెలిపారు. జి.ప్రసన్నకుమార్ 8.50తో ద్వితీయ, రామతులసి మూడో స్థానంలో నిలిచారన్నారు. మూడో సెమిస్టర్ బీఏ హెచ్ఈపీలో డి.మనీషా 8.53 పాయింట్లతో ప్రథమ, రాంబాబు 8.50తో ద్వితీయ, హుస్సేన్‌బాషా 8.40తో తృతీయ స్థానం దక్కించుకున్నారన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట


చౌడేశ్వరీదేవి ఆలయం

సింహాద్రిపురం : మండలంలోని చవ్వారుపల్లెలో చౌడేశ్వరీదేవి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట బుధవారం వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి వేద పండితులు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

మైనింగ్ డైరెక్టర్ల కాలపరిమితి పెంపు

వీరపునాయునిపల్లె : మైనింగ్ డైరెక్టర్ల కాలపరిమితి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషమని డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పదవీకాలం ముగియడంతో మరో రెండు సంవత్సరాలు పొడిగించారన్నారు. రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

నేటి నుంచి ఎన్నికల ప్రచారం

వీరపునాయునిపల్లె : కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు వీరపునాయునిపల్లె మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అనిమెలలో ప్రచారం చేపట్టనున్నట్లు ఆయన తెలియజేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)కు శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గొంతులో ఇన్‌ఫెక్షన్‌తో మాటలు రానివారికి, తలనొప్పి, తల తిరిగే రుగ్మతలు ఉన్నవారికి, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన పలు వ్యాధులతో బాధపడుతున్న వారికి వారు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే చర్మవ్యాధుల వైద్య నిపుణులు వస్తున్నట్లు తెలిపారు. సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, దద్దుర్లు, చుండ్రు, పగుళ్లు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు, ఇతర వ్యాధులకు చికిత్స చేస్తారన్నారు. పులివెందుల ప్రాంత ప్రజలుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వేల్పుల పాఠశాలకు రూ.లక్ష విరాళం


చెక్‌ను అందిస్తున్న ఎన్ఆర్ఐ కుటుంబ సభ్యులు

వేముల : మండలంలోని వేల్పుల ప్రాథమిక ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎన్ఆర్ఐ అబ్దుల్ ఖాదర్, షోయబ్ ఖాదర్ కుటుంబ సభ్యులు లక్ష రూపాయల విరాళం ఇచ్చినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగాల రామలింగారెడ్డి తెలిపారు. అమెరికాలో నివాసముంటున్న వీరు పాఠశాలలో సీఎం మంజూరు చేసిన నిధులతో జరుగుతున్న పనులను చూసి సంతృప్తి చెందారన్నారు. తమ వంతుగా లక్ష రూపాయల సాయాన్ని ఉపాధ్యాయులకు అందించారన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

జమ్మలమడుగు : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సూచించారు. పార్టీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి కింద బొమ్మేపల్లికి చెందిన కర్రు శేషారెడ్డికి రూ.6లక్షలు, మరో ఆరుగురికి రూ.5 లక్షలు అందజేశారు.

భావి శాస్త్రవేత్తలతోనే వైజ్ఞానిక ప్రగతి


వేంపల్లె : విద్యార్థుల సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న చక్రపాణిరెడ్డి


కమలాపురం : జీవ వైవిధ్య వ్యవసాయాన్ని వివరిస్తున్న పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు


జమ్మలమడుగు : చంద్రయాన్ గురించి వివరిస్తున్న విద్యార్థి

కమలాపురం : భావి శాస్త్రవేత్తలతోనే వైజ్ఞానిక ప్రగతి ప్రగతి పరుగులు పెడుతుందని ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి, ఆప్‌కాస్ట్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని పెద్దచెప్పలి జడ్పీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక మండలి (ఆప్ కాస్ట్) ఆధ్వర్యంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్, సోలార్ అండ్ విండ్ ఎనర్జీ ప్రాజెక్ట్, జీవ వైవిధ్య వ్యవసాయం తదితర ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శన ఇచ్చారు. అతిథులు ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి వారిని ప్రశంసించారు. కమలాపురంలోని వెన్నెల స్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓలు బేబీ, సుభాషిణిలు సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్ సీవీరామన్ స్ఫూర్తి

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు సర్ సివి రామన్‌ను స్ఫూర్తిగా తీసుకొని సైంటిస్టులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నివేదిత, వైస్ ప్రిన్సిపల్ సుధీర, డాక్టర్ సి. బాలనారాయణ, శ్రీనిత, డాక్టర్ విజయలక్ష్మి, రెడ్డమ్మ, రామగంగిరెడ్డి, వాణి, మహేంద్ర, గౌతమి పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తిని పెంచుకోవాలి

వీరపునాయనిపల్లె : ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని పాయసంపల్లె కందుల మంగమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ అన్నారు. సైన్సు దినోత్సవం సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణకిషోర్, ఆదినారాయణ, మస్తాన్, సుజాత, మోహన్, రాజశేఖర్, మల్లికార్జున్‌రెడ్డి, సుబ్బన్న, జయరాణమ్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రభుత్వ ,ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పర్యావరణం , రాకెట్ లాంచర్, చంద్రయాన్, మానవ శరీర భాగాల పని చర్యలు, తదితర ప్రయోగాలు చేసి విద్యార్థులు వివరించారు. ఈడిగపేట రేడియన్స్ , వాసవి విద్యా మందిరం, తదితర పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

సింహాద్రిపురం : కోవరంగుట్టపల్లె ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు సతీష్, గాయత్రిల ఆధ్వర్యంలో సైన్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు తమ సృజనాత్మకతతో అద్భుత ప్రాజెక్టు నమూనాలను రూపొందించారు. ప్రధానోపాధ్యాయురాలు రవణమ్మ అభినందించారు.

లింగాల : లింగాల మండలం గుణకనపల్లె ప్రాథమిక పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ నిషేధం, వ్యవసాయ పనిముట్లు, వివిధ రవాణా వ్యవస్థలు, ఆకు, మొక్కల భాగాలు ఇతర అంశాలపై విద్యార్థులు ప్రయోగాలు తయారు చేసి వివరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణయ్య, గోపినాయక్, జయచంద్రారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజ్ఞాన శాస్త్రం చుక్కానిలాంటిది

వేంపల్లె : వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలు జరిపినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. కళాశాలలో బుధవారం సైన్సు దినోత్సవం నిర్వహించారు. ప్రొఫెసర్ ఆర్‌జేయూకేటీ డాక్టర్ భాస్కరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక శ్రీచైతన్య హైస్కూల్‌లో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేసుకొని వచ్చి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ చైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్ సీవీ రామన్‌కు ఘన నివాళి

ముద్దనూరు : దేశానికి అమూల్యమైన సేవలందించిన సీవీ రామన్‌ను మరచిపోలేమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డి


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : సంక్షేమ ఫలాలు ప్రజలకు అందడంతో రాష్ట్రంలో ప్రజారంజక పాలన కొనసాగుతోందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం యర్రగుంట్ల పట్టణంలోని ఐదో వార్డులో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బుధవారం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వృద్ధులతో కాసేపు ముచ్చటించారు. ప్రజా సమస్యలను అక్కడే ఉన్న అధికారుల సమక్షంలో పరిష్కరించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారం సీఎం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, జయరామక్రిష్టారెడ్డి, రాజారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, తుంగ రామక్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు గాయాలు


గాయపడిన జయలక్ష్మి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ మహిళ గాయపడింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని ఎర్రగుంట్ల ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికర్జునరెడ్డి పరిశీలించారు. స్థానికుల కథనం మేరకు పెన్నానది ఒడ్డున ఉన్న నంగనూరుపల్లె గ్రామానికి చెందిన జయలక్ష్మి తన పుట్టినిల్లయిన టీ సుంకేసుల గ్రామానికి వెళ్లేందుకు బుధవారం ఎర్రగుంట్లకు వచ్చింది. బస్టాండ్ ఆవరణంలో ఆటో ఎక్కేందుకు వెళుతుండగా పులివెందులకు వెళ్లే ఆర్టీసీ బస్సు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో జయలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. బస్టాండ్ ఆవరణంలోని వేంపల్లి రోడ్డులో, కడప రోడ్డులో తోపుడు బండ్లు రోడ్డుకు అనుకుని ఉండటం వల్ల బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అందువల్లే ఈ సంఘటన జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణంలో అడ్డంగా ఇతర వాహనాలు నిలబడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఫిర్యాదులన్నీ పరిష్కరించాం


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్ఓ చంద్ర మోహన్

కమలాపురం : రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరించి తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేశామని ఈఆర్ఓ చంద్రమోహన్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది అక్టోబర్ 27న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరించామన్నారు. 9613 ఓట్లు నమోదు చేయగా, డబుల్ ఎంట్రీ, మరణించిన వారి 7282 ఓట్లు తొలగించామన్నారు. అలాగే త్వరలోనే తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్య సేవలు

రీజనల్ ప్రోగ్రామ్ మేనేజర్ కలీం


1962 వాహనాన్ని పరిశీలిస్తున్న రీజనల్ ప్రోగ్రాం మేనేజర్ కలీం

కమలాపురం : పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైఎస్సార్ పశు వైద్యశాల రీజనల్ ప్రోగ్రామ్ మేనేజర్ కలీం అన్నారు. కమలాపురం పట్టణంలోని పశు వైద్య వాహనాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, పశువులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వాహనంలో ఏర్పాటుచేసిన ల్యాబొరేటరీ, మందులు ఎంత మేరకు అందుబాటులో ఉన్నాయో పరిశీలించారు. ప్రతి రోజు ఎన్ని కాల్స్ వస్తున్నాయని, ఎన్ని పశువులకు సేవలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఆరోగ్య భద్రత కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1962 సంచార వాహనాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ చికిత్స అందించలేని కేసులను మాత్రమే పశువైద్య శాలలకు తరలించేలా వాహనం రూపొందించారన్నారు. 1962 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి పశువైద్య సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి అనిల్ కుమార్, 1962 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


కొండూరులో ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : గ్రామాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండూరు గ్రామంలో రూ.20 లక్షలతో ముస్లిం మైనార్టీల శ్మశాన వాటిక వద్ద ప్రహరీ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. గ్రామస్తులు తాగునీటి సమస్య ఉందని చెప్పడంతో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, చంద్రారెడ్డి, నాగేంద్రారెడ్డి, ప్రసాద్, శివారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, రాజారెడ్డి, సుబ్బరామిరెడ్డి, షబ్బీర్ పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం


సన్మానిస్తున్న అతిథులు

చెన్నూరు : విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎంఈఓ గంగిరెడ్డి అన్నారు. తూర్పు హరిజనవాడ ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాడు నేడు కింద పాఠశాల రూపురేఖలను మార్చడమేగాక, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బూట్లు, దుస్తులు, నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారన్నారు. 2017లో ఈ పాఠశాలలో 17 మంది ఉండగా, నేడు 43 మంది చేరారన్నారు. విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పాఠశాల చైర్మన్ రాజేశ్వరి, మాజీ చైర్మన్ నాగలక్ష్మిలు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులతోనే పాఠశాలకు కొత్త కళ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కమనీయం.. భద్రాద్రి రాముడి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని అభి కన్వెన్షన్ హాల్‌లో భద్రాద్రి రాముడి కల్యాణం కనుల పండువుగా సాగింది. భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఎంతో భక్తులు తరలి వెళుతుంటారు. దీని కోసం ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకొని స్వామి వారి కల్యాణం తిలకించి వస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అభి కన్వెన్షన్ యజమాని ప్రముఖ వ్యాపారవేత్త రామకృష్ణారెడ్డి తన సొంత ఖర్చులతో స్వామి వారి కల్యాణం ఎంతో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో జరిపారు. సుమారు మూడు గంటలకు పైగా నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అంతకుముందు మంగళవారం రాత్రి స్వామి వారి ఊరేగింపు పట్టణంలో అన్ని ప్రధాన వీధులలో ఊరేగించారు. బాణసంచాలు, కేరళ సంగీత వాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలతో భక్త జన కోలాహలం నడుమ శోభాయాత్ర సాగింది. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలతోపాటు భోజన ఏర్పాటు చేశారు. ఈ వేడుకలు, కల్యాణ మహోత్సవంలో భద్రాచలం ఆలయ ఈఓ రమాదేవి, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

జాబ్ ఫెస్ట్ - 24కు స్పందన



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ ఫెస్ట్-24కు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. ఏపీ కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫెస్ట్‌కు 25 కంపెనీల ప్రతినిధులు విచ్చేసి ప్రతిభ కలిగిన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ చదువుతున్న సమయంలోనే విద్యార్థుకు ఇలాంటి జాబ్ ఫెస్ట్‌ల ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందడం సంతోషంగా ఉందన్నారు. కడప, రాజంపేట, కోడూరు, రాయచోటి, జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 306 మంది విద్యార్థులు జాబ్ ఫెస్ట్‌కు హాజరుకాగా వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 259 మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను దక్కించుకున్నారన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నిర్వాహకులు ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ సీహెచ్ రాము, జేకేసీ మెంటార్లు సారధి, మంజుల , అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

చిన్నమండెం : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఉమ్మడి కడప జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ పేర్కొన్నారు. బుధవారం చిన్నమండెం విద్యుత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ నెలసరి విద్యుత్ బిల్లుల వసూళ్ల లక్ష్య సాధనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకూడదన్నారు. ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్ల నిర్వహణ విధిగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు 16వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన

జమ్మలమడుగు : పట్టణంలోని 16 వార్డు పరిధిలోని పెద్ద పోస్టాఫీసు నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని వైఎస్ఆర్‌సీపీ నాయకుడు కిరణ్ తెలిపారు. గురువారం ఉదయం ఏడు గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు.

నేటి నుంచి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీస్వామి యాత్ర

కడప కల్చరల్ : శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీ శంకర విజయేంద్రమ సరస్వతీ స్వామి గురువారం నుంచి శనివారం వరకు కడప నగరంలో భక్తులకు అందుబాటులో ఉంటారని చిన్మయమిషన్ కడపశాఖ, శ్రీ లలిత పంచాయతన ఆలయ నిర్వాహకులు స్వామి తురియానంద సాక్షికి తెలిపారు. ఆయన తన విజయ యాత్రలో భాగంగా శ్రీ లలితా పంచాయతన ఆలయంలో భక్తులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు భక్తులకు దర్శనం, ఆశీస్సులు, 9 గంటల నుంచి ఆలయ ప్రాంగణం లోగల తేజోమయ ఆడిటోరియంలో త్రికాల పూజ, విశేష పూజలు ఉంటాయన్నారు.

3న సమావేశం

కడప అర్బన్: దేవుని కడప పోలీసు డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల పరస్పర సహకార గృహ నిర్మాణ సంఘం మహాసభ ద్వితీయ అర్ధ సంవత్సరం (2023-2024) సమావేశంను మార్చి 3వ తేదీన ఉదయం 10 గంటలకు కడపలోని వైఎస్ఆర్ పోలీసు కాలనీ ఆఫీసులో నిర్వహించనున్నట్లు దేవుని కడప పోలీస్ హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్ కె. ప్రభాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంలో ఇళ్ల స్థలాలు పొందిన సభ్యులు గృహ నిర్మాణంను వెంటనే చేసుకోవాలని, వైఎస్ఆర్ పోలీస్ కాలనీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కరెంట్ పోల్స్ ఏర్పాటు, సంఘంలో 1 నుంచి 181 ప్లాటు వరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, సంఘం రాబడులు, చెల్లింపులపై చర్చించి నిర్ణయం తీసుకోవడం, ఆడిట్ చేయుటతో పాటు, ఇతర అంశాల గురించి చర్చిస్తామన్నారు.

కేంద్ర సాయుధ బలగాల వసతి ఏర్పాట్ల పరిశీలన


కడపలో కేంద్ర బలగాల వసతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని కడప, కమలాపురం, రాజంపేట నియోజకవర్గాల్లో విధుల్లో పాల్గొనే కేంద్ర సాయుధ బలగాలకు కల్పించాల్సిన వసతి ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ బుధవారం రాత్రి పరిశీలించారు. కడప నగరంలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శిల్పారామం, జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం (డి.టి.సి), చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలోని జయరాజ్ గార్డెన్స్‌ను జిల్లా ఎస్పీ పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్ర బలగాల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్‌రెడ్డి, రిమ్స్ సీఐ కె. రామచంద్ర, కడప టూటౌన్ సీఐ ఇబ్రహీం, కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, చింతకొమ్మదిన్నె సీఐ శంకర్‌నాయక్ ఎస్పీ వెంటవున్నారు. అలాగే అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ ఆధ్వర్యంలో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజక వర్గాల్లో కేంద్ర బలగాలకు వసతి ఏర్పాట్లు పరిశీలించారు. పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం


ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష అన్నారు. బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో భాగంగా స్థానిక 35వ డివిజన్ నకాష్‌లోని పలు వీధుల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ కుటుంబానికి లబ్ధి చేకూరిందని, సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పలువురు తమ సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

- సయ్యద్ భాను బీ అనే మహిళ మాట్లాడుతూ తమకు జగనన్న ఇంటి స్థలం, నిర్మాణానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ ఆర్ పింఛన్ కానుక పథకాల ద్వారా రూ.10.60 లక్షల లబ్ధి కలిగిందని సంతోషం వ్యక్తం చేసింది.
- ఎస్. రజియా అనే మహిళ మాట్లాడుతూ జగనన్న పాలనలో తమకు ఇంటి స్థలం, ఇంటిని నిర్మించు కోవడానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ పింఛన్ కానుక వంటి పథకాల ద్వారా రూ. 9.90 లక్షలు లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది.